# తెలంగాణ వెన్నెల వాక్కు
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU
TGTEL/25/A0871

హైదరాబాద్ | సంపుటి : 02 | సంచిక :09 | 24-07- 2026 | శుక్రవారం | పేజీలు: 4 | వెల:03/-



తెలంగాణ వెన్నెల వాక్కు — విలేకరులు కావలెను

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ శరవేగంగా రాజకీయ పరిస్థితులపై వాస్తవ కథనాలు అందిస్తూ అనతి కాలంలోనే ప్రజాదరణ పొందిన తెలంగాణ వెన్నెల వాక్కు లో రాష్ట్ర వ్యాప్తంగా స్టాఫర్లు, ఆర్సీ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు కావలెను. అనుభవజ్ఞులకు ప్రాధాన్యం.. కొత్త వారికి ప్రోత్సాహం

మీరు పని చేయాలనుకుంటున్న కేంద్రాల్లో ఖాళీల వివరాల కోసం 7386173123 నంబర్‌ను సంప్రదించండి..

డి. యోగేష్ కుమార్, సీఈవో


## అవును తప్పేంది.. కానీ రాజీనామా పరిష్కారం కాదు:



న్యూఢిల్లీ బ్యూరో
దేశ వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతున్న వివిధ పోటీ పరీక్షల నిర్వహణ, ప్రశ్నాపత్రాల లీకేజీల వివాదంపై కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్ రెడ్డి అత్యంత కీలకమైన మరియు సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశ రాజధాని న్యూఢిల్లీ వేదికగా కాంగ్రెస్, వామపక్షాలు, బీఆర్ఎస్ మరియు ఇతర ప్రతిపక్ష పార్టీలు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపడుతున్న ధర్నాలు, ఆందోళనలపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఢిల్లీలో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఆయన, పరీక్షల నిర్వహణ వ్యవస్థలో కొన్ని లోపాలు జరిగాయని, కొన్ని పొరపాట్లు చోటుచేసుకున్నాయనే విషయాన్ని తాము నిరాకరించడం లేదని బాహాటంగానే అంగీకరించారు. అయితే, అలా తప్పు జరిగింది కదా అని బాధ్యుల రాజీనామాలు కోరడం లేదా రాజీనామాలు చేయడమే దానికి శాశ్వత పరిష్కారం కాదని ఆయన స్పష్టం చేశారు. అమాయకులైన విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్తును అడ్డుపెట్టుకుని ప్రతిపక్షాలు చిల్లర రాజకీయాలు చేస్తున్నాయని, తమ రాజకీయ లబ్ధి పొందేందుకు నిరుద్యోగుల ఆందోళనలను వాడుకోవాలని చూస్తున్నాయని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా ప్రతిపక్షాల తీరుపై కిషన్ రెడ్డి నిప్పులు చెరిగారు. అసలు ఏ ముఖం పెట్టుకుని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఈ రోజు కేంద్ర ప్రభుత్వానికి, బీజేపీకి నీతులు చెబుతున్నాయని ఆయన ఘాటుగా ప్రశ్నించారు. గతం లో కాంగ్రెస్ సుదీర్ఘంగా దేశాన్ని ఏలిన సమయంలో అనేకసార్లు ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని, లక్షలాది మంది విద్యార్థుల జీవితాలు నడిసముద్రంలో మునిగిపోయాయని గుర్తుచేశారు. నాడు ఆ పార్టీకి చెందిన ఏ ఒక్క కేంద్ర మంత్రి అయినా, రాష్ట్ర మంత్రి అయినా

2

## పార్లమెంట్ గేటు వద్ద హైవోల్టేజ్ ఫైట్:

### సీపీఐఎం, బీజేపీ ఎంపీల మధ్య ప్రత్యక్ష ఘర్షణ..



న్యూఢిల్లీ బ్యూరో
దేశ రాజధానిలోని పార్లమెంట్ ప్రాంగణంలో గురువారం అత్యంత ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దేశంలోనే అత్యున్నత ప్రజాస్వామ్య దేవాలయమైన పార్లమెంట్ భవనం ప్రధాన ద్వారం (మకరం ద్వార) సమీపంలో సీపీఐ(ఎం) మరియు అధికార బీజేపీ ఎంపీల మధ్య ప్రత్యక్ష ఘర్షణ చోటుచేసుకుంది. ఇరువర్గాల ప్రజాప్రతినిధులు ఎదురెదురుగా నిలబడి పరస్పర విమర్శలు, హోరెత్తించే నినాదాలు మరియు తీవ్రస్థాయి తోపులాటకు దిగడంతో ప్రాంగణమంతా ఒక్కసారిగా

2

## కాళేశ్వరంపై బీఆర్ఎస్‌కు సీఎం సవాల్



హైదరాబాద్ బ్యూరో:
కాళేశ్వరం ఎత్తిపోతల పథకం నిర్మాణం, మేడిగడ్డ బ్యారేజ్ దెబ్బతిన్న ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్ష బీఆర్ఎస్‌పై మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. కాళేశ్వరం అంశంలో బీఆర్ఎస్ నాయకులు రోజుకో మాట మార్చుతూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన లోపాలు, నిధుల దుర్వినియోగంపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత బీఆర్ఎస్‌దేనని స్పష్టం చేశారు.
మేడిగడ్డ బ్యారేజ్ పునాదులు కుంగిపోయి పిల్లర్లు దెబ్బతిన్న సమయంలో సాగునీటి శాఖ మంత్రిగా హరీశ్‌రావే బాధ్యతలు నిర్వహించారని సీఎం గుర్తుచేశారు. పరిస్థితి అంత తీవ్రంగా ఉంటే అప్పుడే కాఫర్ డ్యామ్ ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. ఒకప్పుడు నదిలో సహజ ప్రవాహం ఉన్నప్పుడే నీటిని ఎత్తిపోసే విధానాన్ని సమర్థించిన నాయకులు, బ్యారేజ్ దెబ్బతిన్న తర్వాత మరమ్మతులు చేపట్టాలని, ఇప్పుడు కాఫర్ డ్యామ్ నిర్మించాలని చెబుతూ తమ వైఖరిని మార్చుకుంటున్నారని విమర్శించారు.
కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీఆర్ఎస్‌కు అనుకూలంగా వ్యవహరిస్తోందని రేవంత్ రెడ్డి

2

## సీఐడీ విచారణకు సిద్ధమా రేవంత్ రెడ్డి?

### మరి నా బినామీ సంస్థతో ఎందుకు ఒప్పందం చేసుకున్నావ్?



హైదరాబాద్ బ్యూరో
గ్లోబరీనా సంస్థ విషయంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న ఆరోపణలన్నీ పూర్తిగా అవాస్తవాలని, స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసమే తనపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం మీడియా ప్రతినిధులతో నిర్వహించిన ప్రత్యేక చిట్‌చాట్‌లో మాట్లాడిన ఆయన, సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యంగా సంచలన వ్యాఖ్యలు చేశారు.
గ్లోబరీనా సంస్థ నిజంగానే తన బినామీ సంస్థ అని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపిస్తున్నారని, ఒకవేళ అది నిజమే అయితే అదే సంస్థతో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు కొత్త ఒప్పందాలు కుదుర్చుకుందో సమాధానం చెప్పాలని నిలదీశారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమే ఆ సంస్థతో ఒప్పందాలు చేసుకుని, ఇప్పుడు రాజకీయ లబ్ధి కోసం దానిని తన బినామీ సంస్థ అని ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ తరహా అసత్య వ్యాఖ్యలపై ఇప్పటికే ముఖ్యమంత్రికి చట్టపరమైన లీగల్ నోటీసులు పంపించానని, తన ఆరోపణలను రుజువు చేయాలని లేదా 48 గంటల్లో బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.
తనపై మోపిన నిందల విషయంలో ఎలాంటి విచారణ ఎదుర్కొనేందుకైనా తాను సిద్ధంగా ఉన్నానని కేటీఆర్

2

## విద్యార్థుల డిమాండ్లకు సంపూర్ణ మద్దతు: రాహుల్ గాంధీ




న్యూఢిల్లీ బ్యూరో
దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టిస్తున్న నీట్ (చీజుజు) ప్రశ్నాపత్రం లీకేజీ అంశంపై నిరసనలు ఉధృతంగా కొనసాగుతున్నాయి. ఈ వ్యవహారంలో ఆందోళన బాట పట్టిన లక్షలాది మంది విద్యార్థులకు, అభ్యర్థులకు 'ఇండియా' (×చీణ×ూ) కూటమి సంపూర్ణంగా అండగా నిలుస్తుందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. దేశ రాజధాని న్యూఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన, విద్యార్థులపై జరుగుతున్న అన్యాయాలను తీవ్రంగా ఖండించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు జరిపిన లాఠీచార్జ్‌లో గాయపడిన ప్రతీ ఒక్క విద్యార్థికి అన్ని విధాలా మద్దతు అందిస్తామని, వారికి న్యాయం జరిగే వరకు వెనకడుగు వేసేది లేదని ఆయన హామీ ఇచ్చారు.
నీట్ పేపర్ లీక్ వ్యవహారం ముదిరి పాకాన పడటంతో తీవ్ర మనస్తాపానికి గురై, భవిష్యత్తుపై నమ్మకం కోల్పోయి ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రాహుల్ గాంధీ తీవ్ర సానుభూతి తెలిపారు. మరణించిన విద్యార్థుల ఆత్మశాంతికి నివాళు లర్పించేందుకు గాను, కూటమి నాయకులతో కలిసి మహాత్మా గాంధీ సమాధి అయిన రాజ్‌ఘాట్‌లో ప్రత్యేక నివాళులర్పించనున్నట్లు రాహుల్ గాంధీ వెల్లడించారు. దేశ భవిష్యత్తు అయిన విద్యార్థులు ఈ విధంగా పేపర్ లీకేజీల రాక్షస వ్యవస్థకు బలవుతుంటే కేంద్ర ప్రభుత్వం కనీస బాధ్యత లేకుండా వ్యవహరించడం శోచనీయమని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.
విద్యార్థులు కోరుతున్న న్యాయమైన డిమాండ్లకు 'ఇండియా' కూటమి సంపూర్ణంగా మద్దతు ఇస్తుందని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా మూలమూలలా ఉన్న అభ్యర్థుల స్వరాన్ని, వారి వేదనను పార్లమెంట్ లోపల, వెలుపలా గట్టిగా వినిపించేందుకు తాము శక్తివంచన లేకుండా కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రైవేట్ ఏజెన్సీల స్వార్థం, అధికారుల నిర్లక్ష్యం వల్ల ఏళ్ల తరబడి పగలు, రాత్రి కష్టపడి చదివిన పేద, మధ్యతరగతి

2

## ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయాలి



న్యూఢిల్లీ బ్యూరో
దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపిన నీట్ (చీజుజు) ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇప్పటికైనా తన మొండివైఖరిని వీడి బుద్ధి తెచ్చుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ రాజధాని న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆమె, కేంద్ర ప్రభుత్వ తీరుపై, ఢిల్లీ పోలీసుల వ్యవహార శైలిపై నిప్పులు చెరిగారు. విద్యార్థులు, ప్రతిపక్షాల నిరసనలను అణచివేసేందుకు ఢిల్లీలో దౌర్జన్యంగా వ్యాపార సముదాయాలు, దుకాణాలను మూసివేయించడం ఏమాత్రం సరికాదని ఆమె మండిపడ్డారు. ప్రభుత్వం తీసుకుంటున్న ఇలాంటి అనాలోచిత నిర్ణయాల వల్ల తీవ్రంగా నష్టపోతున్న పేద, మధ్యతరగతి వ్యాపారులకు అయ్యే ఆర్థిక నష్టాన్ని ఎవరు భరిస్తారని ఆమె నిలదీశారు.

2

# ఎన్నికల గెలుపులు కాదు, పరిపాలనా పారదర్శకతే ముఖ్యం

## విద్యార్థుల ఆందోళనను నిర్లక్ష్యం చేయడం చారిత్రక తప్పిదమే!



ఎన్నికల బరిలో అపారమైన మెజారిటీ సాధించి అధికార పీఠాన్ని దక్కించుకోవడం ఒక ఎత్తయితే, ఆ అధికారాన్ని సుస్థిరంగా నిలబెట్టుకోవడానికి అవసరమైన 'రాజకీయ విశ్వసనీయత'ను కాపాడుకోవడం మరొక ఎత్తు. కానీ నేడు అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ (బిజెపి), దేశవ్యాప్తంగా నిరసన జ్వాలలు రగిలిస్తున్న విద్యార్థుల ఉద్యమాన్ని కేవలం "ప్రతిపక్షాలు వెనుక ఉండి నడిపిస్తున్న రాజకీయ ఆందోళన"గా ముద్ర వేసి కొట్టిపారేయాలని చూడటం అత్యంత ప్రమాదకరమైన ధోరణి. ఢిల్లీ వీధుల్లో విద్యా వ్యవస్థలోని కుళ్ళిన తనాన్ని ప్రశ్నిస్తున్న వేలాది మంది అభ్యర్థులను, వారి తల్లిదండ్రుల నిరసనను శత్రుత్వంగా చూడటం అంటే ప్రజాస్వామ్య మూలాలకే ఎసరు పెట్టడమే.

ఏదైనా ఒక ప్రజా ఉద్యమం రూపుదిద్దుకున్నప్పుడు, అది ఒకానొక కీలక సమయానికి చేరుకుంటుంది. ఆ తర్వాత ఏ ప్రభుత్వమూ దానిని ఇక ఎంతమాత్రం నిర్లక్ష్యం చేయలేదు, కప్పిపుచ్చనూ లేదు. 'కాక్రోచ్ జనతా పార్టీ' పేరిట నేడు విద్యార్థులు చేపట్టిన ఈ ఆందోళన సరిగ్గా అదే పరాకాష్టకు చేరుకుంది. మొన్నటిదాకా దీనిని కేవలం సోషల్ మీడియాలో కొందరు యువకులు సరదాగా చేసే డిజిటల్ పోరాటంగా కొట్టిపారేసిన పాలకులు, ఈ రోజు అది వేలాది మందిని రోడ్లపైకి తెచ్చిన నైజం చూసి నిర్ఘాంతపోతున్నారు. 2011 నాటి అన్నా హజారే అవినీతి వ్యతిరేక ఉద్యమంతో దీనిని పోల్చి తేలికగా చూడటం లేదా కాలక్రమేణా ఇది చల్లారిపోతుందని అహంకారంతో భావించడం పాలకుల అతిపెద్ద మూఢనమ్మకమే అవుతుంది.

**భావజాల ముసుగుతో పరిపాలనా వైఫల్యాన్ని కప్పిపుచ్చలేరు!**

2014 నుండి బిజెపి ప్రభుత్వం సాధించిన అతిపెద్ద ఊరట ఏంటంటే... తమకు ఎదురయ్యే ప్రతీ రాజకీయ వివాదాన్ని లేదా వ్యతిరేకతను తమ అనుకూల సిద్ధాంతం లేదా భావజాల పోరాటం కింద మార్చుకోవడంలో వారు చూపిన ప్రతిభ. జాతీయవాదం, జమ్మూ కాశ్మీర్ ఆర్టికల్ 370 రద్దు, పౌరసత్వ సవరణ చట్టం (జాూూూ), లేదా వ్యవసాయ చట్టాలు... ఇలా ఏ అంశం తీసుకున్నా తమ సొంత కథనంతో ప్రజలను మభ్యపెట్టే వ్యూహం వారి వద్ద ఉండేది. కానీ, నేడు విద్యార్థులు లేవనెత్తుతున్న ప్రశ్నకు అలాంటి భావజాల రంగు పూయడం ఏమాత్రం సాధ్యం కాదు.

ఈ రోజు దేశవ్యాప్తంగా ఉన్న యువత చాలా స్పష్టమైన స్వరంతో ప్రభుత్వాన్ని నిలదీస్తోంది: "ఈ దేశంలో ఒక పోటీ పరీక్షను ప్రశాంతంగా, పారదర్శకంగా, పేపర్ లీకేజీలు లేకుండా ప్రభుత్వం నిర్వహించలేదా?"

ఈ ప్రాథమిక ప్రశ్నకు బిజెపి వర్గాల వద్ద తగిన సమాధానం లేదు. ఇది ముమ్మాటికీ స్పష్టమైన పరిపాలనా వైఫల్యం . దీన్ని 'దేశభక్తి' లేదా 'విదేశీ శక్తుల కుట్ర' అనే ముసుగు పదాల వెనుక దాచడం ఎంతమాత్రం సాధ్యపడదు. పదే పదే ప్రతిష్టాత్మక పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ కావడం అనేది, ఈ రాజ్యం తన పౌరులకు ఇచ్చే ప్రాథమిక హామీని నిలువునా దహించివేస్తోంది. మన దేశంలో ప్రతిష్టాత్మక పోటీ పరీక్షలంటే కేవలం ఏవో కొద్దిపాటి ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ మాత్రమే కాదు. కోట్లాది మంది మధ్యతరగతి, పేద కుటుంబాల సామాజిక, ఆర్థిక ఎదుగుదలకు అవి ఏకైక మార్గాలు! తమ పిల్లల భవిష్యత్తు కోసం జీవితకాల కష్టాన్ని, పొదుపు మొత్తాన్ని కోచింగ్ సెంటర్లకు, పుస్తకాలకు ధారపోస్తున్న తల్లిదండ్రుల కలలను ఈ పేపర్ లీకేజీల మాఫియా నిలువునా చిదిమేస్తోంది. ఫలితంగా, పరీక్షల ప్రక్రియపైనే కాదు, అసలు ఈ ప్రభుత్వ వ్యవస్థ నైతిక నాణ్యతపైనే ప్రజలకు నమ్మకం సడలిపోతోంది.

**పాత చింతకాయ పచ్చడి వ్యూహాలు ఇక్కడ చెల్లవు**

ఇలాంటి నిర్దిష్టమైన, న్యాయమైన నిరసనలను ఎదుర్కోవడం ప్రభుత్వాలకు తీవ్రమైన సవాలు. ఎందుకంటే ఈ పోరాటం వెనుక ఏ రాజకీయ పార్టీ నిగూఢ ప్రయోజనాలో, లేదా ప్రత్యర్థి భావజాలమో లేదు. వ్యవస్థలోని లోపాలను, అవినీతిని ఎత్తిచూపుతున్న విద్యార్థులపై 'దేశద్రోహులు' అని నిందలు వేయడం లేదా 'అర్బన్ నక్సలైట్లు' అని ముద్ర వేసి జైల్లో పెట్టాలని చూడటం ఈసారి ఏమాత్రం పనిచేయదు.

అన్నిటికంటే పాలకులకు గుండెనెప్పి కలిగించే పచ్చి నిజమేంటంటే... ఈ రోజు జంతర్ మంతర్ వద్ద, వీధుల్లో నిరసన తెలుపుతున్న యువతలో, వారి తల్లిదండ్రులలో మెజారిటీ ప్రజలు గతంలో బిజెపికి, ప్రధాని మోదీకి ఓటు వేసి గెలిపించినవారే! తమ భవిష్యత్తును దివ్యంగా మలుస్తుందని నమ్మిన వ్యవస్థలే తమను ముంచేస్తుంటే, దిక్కుతోచక వారు రోడ్లపైకి వచ్చారు. తమ సొంత ఓటు బ్యాంకును, భావి భారత పౌరులను శత్రువులుగా చూసే వివేకశూన్యమైన పనికి ప్రభుత్వం పూనుకోకూడదు.

**ప్రజాదరణ వేరు... నైతిక విశ్వసనీయత వేరు!**

రాజకీయ శాస్త్రంలో ప్రజాదరణ కు, విశ్వసనీయత కు మధ్య చాలా పెద్ద వ్యత్యాసం ఉంది. ఎన్నికల హామీలు, పథకాల ప్రచారం ద్వారా తాత్కాలికంగా ప్రజాదరణ పొంది ఓట్లు సాధించవచ్చు. కానీ విశ్వసనీయత అనేది ప్రభుత్వం పారదర్శకంగా, న్యాయంగా పాలిస్తోందనే ప్రజాస్వామ్య నమ్మకంపై ఆధారపడి ఉంటుంది. గతంలో యుపిఎ-2 ప్రభుత్వం పతనమవ్వడానికి కారణం అది ఎన్నికల్లో ఓడిపోవడం కాదు, పదే పదే వచ్చిన అవినీతి ఆరోపణలతో ప్రజల్లో నైతిక విశ్వసనీయతను పూర్తిగా కోల్పోవడమే! ఈ రోజు మోదీ ప్రభుత్వం కూడా అదే తరహా ప్రమాదపుటంచున నిలబడింది. నిరసన తెలిపే విద్యార్థులపై లాఠీఛార్జీలు చేయించడం, అక్రమ అరెస్టులకు పాల్పడటం, వారి గొంతు నొక్కాలని చూడటం వల్ల ఆందోళనకారుల పట్ల సమాజంలో సానుభూతి మరింత పెరుగుతుందే తప్ప నిరసనలు ఏమాత్రం చల్లారవు.

పావు శతాబ్ద కాలపు యువత భవిష్యత్తుతో చెలగాటమాడే హక్కు ఏ ప్రభుత్వానికీ లేదు. ఎన్నికల గెలుపులు అధికారాన్ని తెచ్చిపెట్టవచ్చు, కానీ పరిపాలనలోని పారదర్శకత మాత్రమే విశ్వసనీయతను నిలబెడుతుంది. బిజెపి నాయకత్వం ఇప్పటికైనా తమ అహంకారాన్ని పక్కనబెట్టి, నిర్బంధాలను ఆపి, విద్యార్థుల ఆందోళన వెనుక ఉన్న న్యాయమైన డిమాండ్లను గుర్తించాలి. వారితో తక్షణమే ప్రత్యక్ష చర్చలు జరిపి, విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేయడమే ప్రభుత్వానికి మిగిలి ఉన్న ఏకైక గౌరవప్రదమైన మార్గం.



**వెంక గారి భూమయ్య**
**సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ**
**9848559863**

## ఝరి (బి) లో వంద శాతం ఓటరు సర్వే పూర్తి



తానూర్, జూలై 23 (తెలంగాణ వెన్నెల వాక్కు): తానూర్ మండల పరిధిలోని ఝరి (బి) గ్రామంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సర్వే వంద శాతం పూర్తయినట్లు అధికారులు తెలిపారు. గ్రామ కార్యదర్శి విక్రమ్, బీఎల్ఓ మైనాబాయిల పర్యవేక్షణలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమన్వయంతో సర్వేను పారదర్శకంగా పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రతినిధి సాయినాథ్, బీజేపీ నేత నాగేష్, బీఆర్ఎస్ నేత చంద్రకాంత్ పాల్గొన్నారు.

## అవును తప్పైంది.. కానీ రాజీనామా పరిష్కారం కాదు:

లేదా బాధ్యత కలిగిన నాయకుడైనా తన పదవికి రాజీనామా చేశారా అని ఆయన నిలదీశారు. అలాగే తెలంగాణలో గడిచిన పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో వరుసగా టీఎస్‌పీఎస్సీ పేపర్లు లీక్ అయి, ఏళ్ల తరబడి కష్టపడి చదివిన పేద నిరుద్యోగ అభ్యర్థుల జీవితాలు నాశనమైనప్పుడు ఆ పార్టీ నాయకులు ఎందుకు రాజీనామాలు చేయలేదని, అప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారని దుయ్యబట్టారు. స్వయంగా తమ సొంత పాలనలో ఎన్నో వైఫల్యాలను, అక్రమాలను మూటగట్టుకున్న ఈ పార్టీలకు ఇప్పుడు ఢిల్లీ వీధుల్లో నిలబడి బీజేపీని, కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు లేదని ఆయన తేల్చి చెప్పారు.

పరీక్షల ప్రక్రియలో జరిగిన పొరపాట్లపై, అక్రమాలపై కేంద్ర ప్రభుత్వం అత్యంత వేగంగా, పారదర్శకంగా స్పందించి చర్యలు చేపడుతోందని కిషన్ రెడ్డి వివరించారు. ఈ లీకేజీలు, అవకతవకలకు పాల్పడిన వారు ఎంతటి ప్రభావవంతమైన వ్యక్తులైనా, ఎంతటి శక్తిమంతులైనా సరే ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని, వారిపై చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాధ్యులను చట్టం ముందు నిలబెట్టి, కేసుల విచారణను అత్యంత వేగవంతం చేసేందుకు ప్రత్యేకంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టులను కూడా ఏర్పాటు చేస్తున్నామని, తద్వారా దోషులకు త్వరితగతిన కఠిన శిక్ష పడేలా చూస్తామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు, అక్రమాలు ఎక్కడా పునరావృతం కాకుండా సరికొత్త ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, పకడ్బందీగా పరీక్షలు నిర్వహించడానికి అవసరమైన విధివిధానాలు, నూతన సంస్కరణలు రూపొందిస్తున్నట్లు చెప్పారు.

దేశంలోని విద్యార్థుల, యువత భవిష్యత్తును సురక్షితంగా కాపాడటమే నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని, నిరుద్యోగ యువత ఎవరూ కూడా అధైర్యపడవలసిన అవసరం లేదని ఆయన ధైర్యం చెప్పారు. ప్రతిపక్షాలు తమ స్వార్థ పూరిత రాజకీయ ప్రయోజనాల కోసం విద్యార్థుల భయాందోళనలను వ్యాపారంగా మార్చుకోవాలని చూస్తున్నాయని, వారి కుట్రలను, ద్వంద్వ ప్రమాణాలను విద్యార్థులు, దేశ ప్రజలు స్పష్టంగా గమనించాలని కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. కేవలం రాజీనామాలతో వ్యవస్థలో ఉన్న సమస్యలు తీరవని, లోపాలను మూలాల నుంచి సరిదిద్ది, మొత్తం పరీక్షల వ్యవస్థను ప్రక్షాళన చేయడమే నిజమైన పరిష్కారమని ఆయన పునరుద్ఘాటించారు. ప్రతిపక్షాల రాద్ధాంతాన్ని తిప్పికొడుతూ, అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వం విశ్రమించదని ఆయన స్పష్టం చేశారు.

## పార్లమెంట్ గేటు వద్ద హైవోల్టేజ్ ఫైట్:

రణరంగాన్ని తలపించింది.

?వివరాల్లోకి వెళ్తే.. కేంద్ర ప్రభుత్వ విధానాలు, వివిధ రకాల రాజకీయ అంశాలు మరియు నిరుద్యోగ విపత్తుపై నిరసన తెలిపేందుకు సీపీఐ(ఎం) పార్టీకి చెందిన పలువురు ఎంపీలు ప్లకార్డులు చేతబూని పార్లమెంట్ ఆవరణలోకి చేరుకున్నారు. ప్రభుత్వం తీరుకు వ్యతిరేకంగా వారు నినాదాలు చేస్తూ నిరసన తెలుపుతున్న సమయంలోనే, బీజేపీకి చెందిన ఎంపీలు కూడా ప్రతిపక్షాల వైఖరిని, పార్లమెంట్ కార్యకలాపాలను అడ్డుకుంటున్న తీరును నిరసిస్తూ అక్కడికి చేరుకున్నారు. దీంతో రెండు వర్గాల ఎంపీలు ముఖాముఖిగా తలపడ్డారు.

?ప్రారంభంలో కేవలం వాగ్వాదంగా మొదలైన ఈ వివాదం, కొద్దిసేపటికే తీవ్ర స్థాయికి చేరుకుంది. ఒకరిపై ఒకరు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసుకుంటూ, వేళ్లు చూపిస్తూ హెచ్చరించుకున్నారు. మాటమాట పెరగడంతో ఇరువైపుల నుంచి ఎంపీలు ముందుకు దూసుకువచ్చి పరస్పరం తోసుకోవడం ప్రారంభించారు. వాతావరణం తీవ్ర ఘర్షణ వాతావరణంగా మారి, ప్రజాప్రతినిధులు భౌతిక దాడులకు దిగే ప్రమాదం కనిపించడంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న పార్లమెంట్ సెక్యూరిటీ సిబ్బంది మరియు మార్షల్స్ ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు.

పరిస్థితి చేయిదాటిపోకుండా ఉండేందుకు భద్రతా సిబ్బంది అత్యంత సమయస్ఫూర్తితో వ్యవహరించారు. సీపీఐ(ఎం) మరియు బీజేపీ ఎంపీల మధ్య మధ్యలో సుమారు పదుల సంఖ్యలో ఉన్న సెక్యూరిటీ ఆఫీసర్లు ఒకరి చేతులు ఒకరు పట్టుకుని ఒక 'మానవ హారం' (ఎబఝఅ జప్ఝఊఅ) గా ఏర్పడ్డారు. ఇరువర్గాలను ఒకరికొకరు దగ్గరకు రాకుండా విడదీస్తూ రక్షణ కవచంలా నిలబడ్డారు. ఎంపీలు ముందుకు రావడానికి ప్రయత్నించినప్పటికీ, భద్రతా సిబ్బంది గట్టిగా అడ్డుకుని వారిని వెనక్కి నెట్టే ప్రయత్నం చేశారు.

?సెక్యూరిటీ సిబ్బంది కల్పించుకుని ఇరువైపులా ఉన్న సీనియర్ నాయకులకు, ఎంపీలకు నచ్చజెప్పి, సర్దిచెప్పి అక్కడి నుండి చెదరగొట్టడంతో పెను ప్రమాదం త తప్పింది. ఏమాత్రం ఆలస్యమైనా ప్రజాప్రతినిధుల మధ్య పెద్ద ఎత్తున భౌతిక దాడి జరిగే అవకాశముందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. దేశ అత్యున్నత చట్టసభ ప్రాంగణంలోనే బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న ఎంపీలు ఈ రీతిలో వీధి పోరాటాన్ని తలపించేలా ప్రత్యక్ష ఘర్షణకు దిగడం, తోపులాటలు చేసుకోవడం పట్ల సర్వత్రా తీవ్ర దిగ్భ్రాంతి, విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## సీఐడీ విచారణకు సిద్ధమా రేవంత్ రెడ్డి?



స్పష్టం చేశారు. గ్లోబరీనా అంశంలో తాను లై డిటెక్టర్ (లై డిటెక్షన్) పరీక్షలకు, అలాగే సీఐడీ లేదా సిట్ విచారణకు సంపూర్ణంగా సిద్ధంగా ఉన్నానని ఓపెన్ ఛాలెంజ్ విసిరారు. మరి ఇదే సవాల్‌ను స్వీకరించి, తన కుటుంబంపై వస్తున్న రకరకాల అవినీతి, అక్రమ కాంట్రాక్టుల ఆరోపణల అంశంలో సీఎం రేవంత్ రెడ్డి సిట్ లేదా సీఐడీ విచారణకు సిద్ధమా అని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు.

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై విమర్శలు గుప్పించిన కేటీఆర్, రేవంత్ రెడ్డి పగటివేళ కాంగ్రెస్ పార్టీ తరఫున మాట్లాడుతూ, రాత్రి వేళల్లో బీజేపీ నేతలతో రాజీ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ఢిల్లీలోని రాజ్ భవన్ లేదా లోక్‌భవన్ ముందు చేయాల్సిన ఆందోళనలను వదిలేసి, కొడంగల్‌లో ధర్నాలు చేయడం కేవలం ప్రజాదృష్టిని మళ్లించే నాటకమని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వాన్ని, ప్రధాని నరేంద్ర మోదీని ప్రశ్నించడానికి రేవంత్ రెడ్డి భయపడుతున్నారని, పాత కేసుల భయంతో పాటు అమృత్ పథకం కాంట్రాక్టుల ప్రయోజనాల కోసమే కేంద్రంతో లోపాయికారీ ఒప్పందాలు చేసుకుంటున్నారని విమర్శించారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అధిష్ఠానానికి ఒక మూట పంపితే, బీజేపీ పెద్దలకు రెండు మూటలు పంపుతున్నారని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు.

ఏలాంటి ఆధారాలు లేకుండా ప్రతిపక్ష నాయకులపై పరువు నష్టం కలిగించేలా మాట్లాడటం రేవంత్ రెడ్డికి అలవాటుగా మారిందని కేటీఆర్ దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే రోజూ ఒక కొత్త డ్రామాకు తెరలేపుతోందని, ప్రజలు ఈ రాజకీయ కక్షసాధింపులను గమనిస్తున్నారని ఆయన హెచ్చరించారు. తనపై చేసిన ఆరోపణలను వెనక్కి తీసుకోకపోతే సివిల్, క్రిమినల్ కేసులతో పాటు పరువు నష్టం దావా కూడా వేస్తానని స్పష్టం చేశారు.

## విద్యార్థుల డిమాండ్లకు సంపూర్ణ మద్దతు: రాహుల్ గాంధీ

కుటుంబాల పిల్లల భవిష్యత్తు నాశనమవుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో ఉన్న ప్రభుత్వం ఇప్పటికైనా తన మొండివైఖరిని వీడాలని, విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఈ నీట్ కుంభకోణం వెనుక ఉన్న అసలు సూత్రధారులను, లీకేజీలకు బాధ్యులైన వారిని ఎంతటి వారాకైనా సరే గుర్తించి వారిపై చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకోవాలని రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, విద్యార్థుల్లో మళ్లీ నమ్మకాన్ని నింపేలా పారదర్శకమైన విచారణ జరిపించాలని కోరారు. ప్రశ్నాపత్రాల లీకేజీల వల్ల నష్టపోయిన విద్యార్థులందరికీ తగిన న్యాయం జరిగే వరకు, అలాగే పరీక్షల నిర్వహణ వ్యవస్థలో పారదర్శకత వచ్చే వరకు ప్రతిపక్షాలు విద్యార్థుల తరపున తమ పోరాటాన్ని ఆపేది లేదని ఆయన పునరుద్ఘాటించారు. దేశ యువత భవిష్యత్తు కోసం ఎంతటి పోరాటానికైనా తాము సిద్ధంగా ఉన్నామని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు.

## ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయాలి

కేంద్రంలో ఉన్న భారతీయ జనతా పార్టీ తీవ్ర అధికార మదంతో వ్యవహరిస్తోందని రేణుకా చౌదరి ఘాటుగా విమర్శించారు. రాజ్యాంగం అందించిన ప్రజాస్వామ్య పద్ధతులను, నిరసన తెలిపే ప్రాథమిక హక్కులను పూర్తిగా పక్కనపెట్టి ప్రతిపక్ష నాయకులు, ఆందోళన బాట పట్టిన నిరుద్యోగ యువతపై పోలీసులతో ఒత్తిడి తీసుకురావడం తీవ్ర విచారకరమని అన్నారు. నిరసనకారుల గొంతు నొక్కడం ద్వారా తమ తప్పులను కప్పిపుచ్చుకోవచ్చని భావించడం బీజేపీ మూర్ఖత్వమే అవుతుందని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన ప్రభుత్వమే దాన్ని కాలరాస్తోందని, నిరంకుశంగా ప్రవర్తిస్తున్న బీజేపీకి దేశ ప్రజలు మరియు విద్యార్థులు తగిన సమయంలో ఖచ్చితంగా గుణపాఠం చెబుతారని ఆమె హెచ్చరించారు.

## కాళేశ్వరంపై బీఆర్ఎస్‌కు సీఎం సవాల్

ఆరోపించారు. ఆ రాజకీయ సంబంధాల కారణంగానే కాళేశ్వరం వ్యవహారంపై జరుగుతున్న దర్యాప్తును ప్రభావితం చేసే ప్రయత్నాలు జరిగాయని అన్నారు. వేల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి నాసిరకం నిర్మాణాలతో తెలంగాణ రైతులకు నష్టం కలిగించారని, దీనిపై బీఆర్ఎస్ అగ్రనేతలు ప్రజలకు స్పష్టమైన వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టులోని ప్రతి అంశంపై పారదర్శకంగా విచారణ చేపట్టిందని సీఎం తెలిపారు. డిజైన్ లోపాలు, నిర్మాణ నాణ్యత, వ్యయాలపై సమగ్రంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మేడిగడ్డ బ్యారేజ్ పునరుద్ధరణపై రాజకీయ నిర్ణయాలు కాకుండా జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ, నిపుణుల కమిటీలు ఇచ్చే శాస్త్రీయ సూచనల ఆధారంగానే ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటుందని సీఎం స్పష్టం చేశారు. బీఆర్ఎస్ రాజకీయ ఆరోపణలకు భయపడేది లేదని, రైతాంగ ప్రయోజనాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అక్రమాలపై నిజానిజాలు వెలుగులోకి తెచ్చి, ప్రజాధనానికి నష్టం కలిగించిన ప్రతి ఒక్కరినీ చట్టం ముందు నిలబెడతామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# 'జలసిరి' ఫామ్ పాండ్లు భూగర్భ జలాల పెంపునకు దోహదం చేస్తాయి:

- కుబీర్ మండలం దోడర్నలో రైతు దంపతుల క్షేత్రంలో ఫామ్ పాండ్ పనులకు భూమిపూజ
- ఎల్ నినో పరిస్థితుల్లో అత్యవసర నీటి నిల్వకు రైతులు ఫామ్ పాండ్లు నిర్మించుకోవాలి

నిర్మల్/కుబీర్, జూలై 23 (తెలంగాణ వెన్నెల వాక్కు):
వర్షాభావ పరిస్థితుల్లో భూగర్భ జలాల సంరక్షణకు మరియు పంటలకు సాగునీటి ఎద్దడి కలగకుండా చూసేందుకు తెలంగాణ జలసిరి కార్యక్రమంలో భాగమైన ఫామ్ పాండ్ ల నిర్మాణాలు ఎంతగానో దోహదం చేస్తాయని నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. గురువారం ఆయన కుబీర్ మండలంలోని దోడర్న గ్రామంలో పర్యటించి, జలసిరి పథకంలో భాగంగా గ్రామానికి చెందిన రైతు దంపతులు గోరేకర్ సంతోష్, సాగరలకు చెందిన వ్యవసాయ క్షేత్రంలో నూతన ఫామ్ పాండ్ నిర్మాణ పనులకు అధికారికంగా భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. స్వచ్ఛందంగా ఫామ్ పాండ్ నిర్మాణానికి ముందుకు వచ్చిన రైతు దంపతులను కలెక్టర్ శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు.




రైతులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం:
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి రైతు బాధ్యతగా తమ వ్యవసాయ క్షేత్రాల్లో ఫామ్ పాండ్ లు ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ నిర్మాణాలకు ప్రభుత్వం తగిన ఆర్థిక సహాయం అందజేస్తుందన్నారు. ప్రస్తుతం ఎల్ నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం నమోదవుతున్న తరుణంలో, ఇటువంటి నీటి నిల్వ నిర్మాణాల వల్ల అత్యవసర పరిస్థితుల్లో పంట ఎండిపోకుండా కాపాడుకోవచ్చన్నారు. రైతులు పెద్ద ఎత్తున ఫామ్ పాండ్ ల నిర్మాణానికి ముందుకు రావాలన్నారు. అనంతరం తెలంగాణ జలసిరి ప్రచార గోడ ప్రతులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డీఆర్డీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీఓ శ్రీనివాస్, సర్పంచ్ జాదవ్ సావిత్రి పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అగ్రనేతల అరెస్టుకు నిరసనగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా క్షేత్రస్థాయి ఆందోళనలు

- నీట్ అక్రమాలపై ప్రశ్నించిన రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ అరెస్టును ఖండించిన నేతలు
- భైంసా, బాసర, సోన్, సారంగాపూర్ మండలాల్లో రోడ్డెక్కిన కాంగ్రెస్ శ్రేణులు

నిర్మల్/భైంసా, జూలై 23 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నీట్ పరీక్ష పేపర్ లీకేజీ కుంభకోణంపై శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు మద్దతు తెలిపిన కాంగ్రెస్ జాతీయ నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గేలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ గురువారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసనలు హోరెత్తాయి. భైంసా, బాసర, సోన్, సారంగాపూర్ తదితర మండల కేంద్రాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున ధర్నాలు, ర్యాలీలు నిర్వహించి తహసీల్దార్లకు వినతిపత్రాలు సమర్పించారు.



కేంద్ర విద్యాశాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలి:
ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జులు, నాయకులు మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నందుకే ప్రతిపక్ష నేతలను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలో ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే రాజ్యాంగ హక్కును కేంద్రం కాలరాస్తోందన్నారు. పరీక్షల నిర్వహణలో విఫలమైన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని, పేపర్ లీక్ బాధ్యులపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నిరసనల్లో ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్, కూచాడి శ్రీహరి రావు, భోంస్లే నారాయణ్ రావు పటేల్, తాహెర్ బిన్ హందాన్, ఆరేపల్లి మోహన్, సర్పంచ్ వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

# నేడు రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్



.భైంసా, జూలై 24 (తెలంగాణ వెన్నెల వాక్కు):
కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, ఎన్టీఏ ఏజెన్సీ నిర్వహించిన పోటీ పరీక్షల లీకేజీలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నేడు (శుక్రవారం) రాష్ట్రవ్యాప్త "విద్యా సంస్థల బంద్" కు విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. భైంసా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బంద్ ప్రచార పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు.
ఎన్టీఏను తక్షణమే రద్దు చేయాలని, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, వీబీఎస్ఏ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నేడు జరిగే బంద్‌లో జిల్లాలోని ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలలను మూసివేసి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐపీఎస్ యు జిల్లా కార్యదర్శి గడపాలి పరమేష్, పీడీఎస్ యు అధ్యక్షుడు వాగ్మారే మహేందర్, ఎన్ఎస్ యు ఐ కార్యదర్శి అంజాద్ పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ ఆవిర్భావ వేడుకలు

మంచిర్యాల, జూలై 23 (తెలంగాణ వెన్నెల వాక్కు):
జర్నలిస్టుల హక్కుల రక్షణ, సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ (టిజెఎ) పనిచేస్తోందని సంఘం జిల్లా అధ్యక్షుడు పార్వతి సురేష్ తెలిపారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో గురువారం టిజెఎ 12వ ఆవిర్భావ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జర్నలిస్టులు వృద్ధులకు ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు.
అనంతరం సంఘ కార్యాలయంలో వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. జర్నలిస్టుల ఐక్యత కొరకు వ్యవస్థాపక అధ్యక్షుడు ఉప్పల లక్ష్మణ్ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సారంగరావు, డేగ ఆంజనేయులు, గట్టయ్య, గంగులు, అమర్నాథ్ రెడ్డి పాల్గొన్నారు.



# తెలంగాణ'వెన్నెల వాక్కు' కథనానికి స్పందన

# రేషన్ దందాపై అధికారుల వివరణ

.నిర్మల్, జూలై 23 (తెలంగాణ వెన్నెల వాక్కు):
జిల్లా వ్యాప్తంగా యథేచ్ఛగా సాగుతున్న రేషన్ బియ్యం అక్రమ రవాణా దందాపై 'తెలంగాణ వెన్నెల వాక్కు' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి జిల్లా పౌరసరఫరాల శాఖ గురువారం స్పందించింది. ఇటీవల ఖానాపూర్ పట్టణంలోని ఇందిరానగర్ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 23.40 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకుని వాహనాన్ని సీజ్ చేశారని, సదరు బియ్యాన్ని ఖానాపూర్ పాయింట్ కు తరలించినట్లు తెలిపారు. అక్రమాలకు పాల్పడిన వారిపై 6ఏ కేసు నమోదు చేసినట్లు పౌరసరఫరాల శాఖాధికారి అధికారిక నివేదికలో తెలిపినట్లు స్పష్టం చేశారు.
ఈ ఏడాది జనవరి నుండి ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ముమ్మర తనిఖీల్లో మొత్తం 275.27 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, 10 కేసులు నమోదు చేయడంతో పాటు 5 వాహనాలను సీజ్ చేశామని తెలిపారు. జిల్లాలో అక్రమ రేషన్ దందాను పూర్తిగా అరికట్టేందుకు రెవెన్యూ, పౌరసరఫరాల శాఖల అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహిస్తున్నారని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని వివరణ ఇచ్చారు




# ప్రతిపక్షాలపై విమర్శలా.. నిర్మల్ అభివృద్ధి పట్టదా

నిర్మల్, జూలై 23 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ఢిల్లీలో విద్యా వ్యవస్థ వైఫల్యాలపై పోరాడుతున్న విద్యార్థులపై, ప్రతిపక్షాలపై విమర్శలు చేయడం మాని స్థానిక నిర్మల్ అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సయ్యద్ హైదర్ హితవు పలికారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, నిర్మల్ పట్టణంలోని వైఎస్సార్ కాలనీ, మహాలక్ష్మి వాడల్లో కనీసం మురుగునీటి కాలువలు, సీసీ రోడ్లు లేక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు.
ప్రభుత్వ ఆసుపత్రిలో ఏడాదిగా సీటీ స్కాన్ సేవలు అందుబాటులో లేకపోవడం వల్ల పేదలు



తీవ్రంగా నష్టపోతున్నారని మండిపడ్డారు. సోషల్ మీడియా వేదికగా విమర్శలు చేయడం ఆపి, స్థానిక మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయాలని, లేనిపక్షంలో కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిస్తామని హెచ్చరించారు.

# భైంసాలో ముధోల్ నియోజకవర్గ స్థాయి బీఎల్ఏ సమావేశం

.భైంసా, జూలై 23 (తెలంగాణ వెన్నెల వాక్కు):
భైంసా పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణరావు పటేల్ నివాసంలో కాంగ్రెస్ పార్టీ ముధోల్ నియోజకవర్గ స్థాయి బూత్ లెవెల్ ఏజెంట్ల (బీఎల్ఏ) ప్రత్యేక సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పార్లమెంట్ ఇన్‌చార్జ్ ఆరేపల్లి మోహన్ ను మాజీ ఎమ్మెల్యే శాలువాతో ఘనంగా సన్మానించారు.



ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో బూత్ లెవెల్ ఏజెంట్లు పారదర్శకంగా వ్యవహరిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో అసెంబ్లీ ఇన్‌చార్జ్ మాళ్లారి రామ్ రెడ్డి, లోకేశ్వరం మాజీ అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి, అసెంబ్లీ యూత్ ప్రెసిడెంట్ షఫీ పాల్గొన్నారు

# వరినారు మడిని పరిశీలించిన కేవీకే శాస్త్రవేత్త

.దిలావర్పూర్, జూలై 23 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నాబార్డ్, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం సౌజన్యంతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం బన్సపల్లి ఆధ్వర్యంలో చేపట్టిన విత్తనోత్పత్తి వరినారు మడిని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ గురువారం సందర్శించి తనిఖీ చేశారు.



దిలావర్పూర్ గ్రామానికి చెందిన గంగిరెడ్డి అనే రైతు క్షేత్రంలో సాగు చేస్తున్న కూనారం-1638 వరి రకం నారుమడిని పరిశీలించి, పైరు ఆరోగ్యకరమైన ఎదుగుదల కోసం లీటరు నీటికి 5 గ్రాముల అగ్రిమిన్ మాక్స్ కలిపి పిచికారీ చేయాలన్నారు. కాండం తొలుచు పురుగు నివారణకు ఎకరానికి 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు చల్లుకోవాలని సూచించారు.

# విధులకు ముఖం చాటేస్తున్న ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి

కుబీర్, జూలై 23 (తెలంగాణ వెన్నెల వాక్కు):
కుబీర్ మండలం అంతర్ని ప్రభుత్వ పాఠశాలలో విధులకు హాజరుకాకుండా రాజకీయ పార్టీల కార్యకలాపాల్లో పాల్గొంటున్న ప్రధానోపాధ్యాయుడు సుభాష్ పై విద్యాశాఖ అధికారులు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఛాత్ర యువ సంఘర్షణ సమితి (సీవైఎస్ఎస్) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శీతల్కర్ అరవింద్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు.
సదరు హెచ్ఎం కేవలం ఉదయాన్నే ఎఫ్ఆర్ఎస్ యాప్ లో డిజిటల్ హాజరు వేసుకుని, పాఠశాలను వదిలి రాజకీయ నాయకుల కార్యాలయాల్లో కాలక్షేపం చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై మండల విద్యాధికారికి తెలిసినా కొమ్ముకాయడం సరికాదన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సదరు ఉపాధ్యాయుడిపై, ఎంఈఓపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

# నేటి విద్యాసంస్థల బంద్ ను జయప్రదం చేయండి: వామపక్షాలు

నిర్మల్, జూలై 24 (తెలంగాణ వెన్నెల వాక్కు):
కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాల వల్ల దేశంలో విద్యా వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని ఎస్.ఎఫ్.ఐ జిల్లా కన్వీనర్ దిగంబర్, పి.డి.ఎస్.యు అధ్యక్షుడు సింగరి వెంకటేష్ ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా పరిరక్షణ కొరకు నేడు (శుక్రవారం) వామపక్ష విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చిన రాష్ట్రవ్యాప్త కళాశాలల బంద్ ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన దాడులపై నిష్పాక్షిక విచారణ జరపాలని, పేపర్ లీకేజీలకు బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి రాజీనామా చేయాలని, ఎన్టీఏను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యాసంస్థల యాజమాన్యాలు బంద్‌కు సహకరించి స్వచ్ఛందంగా తరగతులు నిలిపివేయాలని కోరారు.



# ఝరి (బి) లో ఫామ్ కుంట పనులు ప్రారంభం

తానూర్, జూలై 23 (తెలంగాణ వెన్నెల వాక్కు):
తానూర్ మండలంలోని ఝరి (బి) గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద రైతు ఉండేపోళ్ల సాయినాథ్ పొలంలో మంజూరైన ఫామ్ కుంట నిర్మాణ పనులకు గురువారం భూమి పూజ చేసి ప్రారంభించారు. వర్షపు నీటిని నిల్వ చేసి భూగర్భ జలాలను పెంచడానికి ఈ కుంటలు ఎంతగానో ఉపయోగపడతాయని సాంకేతిక సహాయకుడు రమణ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విక్రమ్, ఈజీఎస్ సిబ్బంది, ఉపాధి హామీ కూలీలు, రైతులు పాల్గొన్నారు.



# గుండంపల్లిలో 'జలసిరి' ఫామ్‌పాండ్ పనులను ప్రారంభించిన అదనపు కలెక్టర్

**- భూగర్భ జలాల పరిరక్షణ, నీటి నిల్వకు ఫామ్‌పాండ్‌లు ఎంతగానో ఉపయోగపడతాయి**
**- నిర్దేశిత గడువులోగా నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని ఆదేశం**

దిలావర్‌పూర్, జూలై 23 (తెలంగాణ వెన్నెల వాక్కు):
వర్షాభావ పరిస్థితుల్లో భూగర్భ జలాల సంరక్షణకు, రైతుల సాగునీటి అవసరాలకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 'జలసిరి' ఫామ్‌పాండ్‌ల నిర్మాణాలు ఎంతగానో ఉపయోగపడతాయని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం గుండంపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గురువారం అధికారికంగా నిర్వహించిన జలసిరి ఫామ్‌పాండ్ పనులను ఆయన నేరుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి రైతులతో మాట్లాడారు.



రైతులు వర్షపు నీటిని నిల్వ చేసుకోవాలి:
ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి రైతు తమ పొలాల్లో వర్షపు నీటిని ఇంకింపజేసేలా ఫామ్‌పాండ్‌ల నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని నీటి సంరక్షణకు సహకరించాలన్నారు. అధికారులు ఈ నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరుణ రాణి, ఎంపీఓ గోవర్ధన్, సర్పంచ్ తక్కల రమణారెడ్డి, వ్యవసాయ అధికారి రాజశేఖర్ రెడ్డి, ఏపీఓ దివ్యరెడ్డి, పంచాయతీ కార్యదర్శి, వివోలు పాల్గొన్నారు.

# భైంసాలో మైనర్ బాలికపై వేధింపులు: పోక్సో చట్టం కింద యువకుడి అరెస్ట్

**- ప్రేమ పేరుతో మోసం చేసిన రాంటేక్ యువకుడు.. రిమాండ్ కు తరలించిన పోలీసులు**
**- మైనర్ల పట్ల అన్యాయం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని సీఐ ప్రవీణ్ కుమార్ హెచ్చరిక**

భైంసా, జూలై 23 (తెలంగాణ వెన్నెల వాక్కు):
భైంసా మండల పరిధిలో ఒక మైనర్ బాలికను ప్రేమ పేరుతో నమ్మించి మోసానికి గురిచేసిన ఘటనపై భైంసా రూరల్ పోలీసులు కఠినంగా స్పందించి నిందితుడిని అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం, రాంటేక్ గ్రామానికి చెందిన ఒక యువకుడు భైంసా మండలానికి చెందిన మైనర్ బాలికను ప్రేమ పేరుతో వేధించి మోసగించాడు. బాధితురాలి తల్లి ఇచ్చిన అధికారిక ఫిర్యాదు మేరకు భైంసా రూరల్ పోలీసులు తక్షణమే పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.




న్యాయస్థానం ఆదేశాలతో జ్యుడీషియల్ కస్టడీ:
ఘటనపై విచారణ జరిపిన రూరల్ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి గురువారం న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయమూర్తి అతనికి జ్యుడీషియల్ కస్టడీ విధించారు. నేరానికి ఉపయోగించిన మోటార్ సైకిల్, మొబైల్ ఫోన్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా భైంసా రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, మైనర్లపై జరిగే వేధింపులు, అక్రమాల విషయంలో పోక్సో చట్టం అత్యంత కఠినంగా అమలులో ఉందని, అలాంటి నేరాలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన శిక్షలు పడతాయని హెచ్చరించారు.

# ప్రత్యేక పిల్లలకు అన్నదానంచేసిన టీజేఏ ప్రతినిధులు

నిర్మల్, జూలై 23 (తెలంగాణ వెన్నెల వాక్కు):
తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీజేఏ) 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్మల్ జిల్లా కొండాపూర్ గ్రామంలోని శాంతినికేతన్ మానస వికలాంగుల కేంద్రం, బాలసదనం పిల్లలకు గురువారం ఉచిత అన్నదానం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన



చెనగారపు చిన్నయ్య కేక్ కట్ చేసి అన్నదానాన్ని ప్రారంభించారు. సమాజంలో ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు ఆదరణ అందించడం అందరి బాధ్యత అని ఆయన కొనియాడారు. వార్షికోత్సవ సమయాల్లో ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సైకాలజిస్ట్ ప్రదీప్, బాలసదనం సూపరింటెండెంట్ వైష్ణవి, కవిత, శాంతినికేతన్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మధుసూదన్, టీజేఏ సభ్యులు పాల్గొన్నారు.

# హనుమ అవార్డ్స్‌లో ఓం శ్రీ కళా నిలయం జయభేరి

ముధోల్, జూలై 23 (తెలంగాణ వెన్నెల వాక్కు):
తిరుపతి మహతి కళాక్షేత్రంలో అభినయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 26వ జాతీయ స్థాయి హనుమ అవార్డ్స్-2026 పోటీల్లో నిర్మల్ జిల్లా కళాకారులు అద్భుత ప్రతిభ కనబరిచారు. భైంసా పట్టణానికి చెందిన ఓం శ్రీ



కళా నిలయం డాన్స్ స్కూల్ ఆధ్వర్యంలో ముధోల్ మండల విద్యార్థులు జాతీయ స్థాయి కూచిపూడి, భరతనాట్య పోటీల్లో పాల్గొని ప్రదర్శన ఇచ్చారు.
విద్యార్థుల ప్రతిభను గుర్తించిన జాతీయ నిర్వహణ కమిటీ ప్రతినిధులు వారికి ప్రదర్శన ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు. విద్యార్థులను డాన్స్ స్కూల్ నిర్వాహకుడు గిరి యోగేశ్వర్, తల్లిదండ్రులు, కళాభిమానులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

# బోధనలో విద్యా ప్రమాణాలు పెంచాలి: డీఈఓ భోజన్న

నిర్మల్, జూలై 23 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ పట్టణంలోని నారాయణ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంలు, గణిత ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న మూడు రోజుల సమగ్ర విద్యా శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్న గురువారం సందర్శించి పరిశీలించారు. ప్రభుత్వ బడుల్లో చదివే పిల్లలకు గుణాత్మక విద్యను అందించి పాఠశాలల్లో నమోదు పెంచాలన్నారు.
గణిత ఉపాధ్యాయులు ప్రయోగాత్మక, కృత్యధార బోధనా (ఆక్టివిటీ బేస్డ్ లెర్నింగ్) పద్ధతుల ద్వారా బోధించి విద్యార్థులలో భయం పోగొట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఎంఓ నరసయ్య, కోర్సు ఇన్‌చార్జులు పరమేశ్వర్, జనార్ధన్, రిసోర్స్ పర్సన్లు పద్మ, సదానందం, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

# రబీంద్ర స్కూల్ లో 40 మంది బాలికలకు హెచ్‌పీవీ టీకాలు

ముధోల్, జూలై 23 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ముధోల్ మండల కేంద్రంలోని రబీంద్ర ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆధ్వర్యంలో విద్యార్థినులకు హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోమా వైరస్) వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఆసుపత్రి వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు సుమారు 40 మంది బాలికలకు వ్యాక్సిన్ వేసారు.
పాఠశాల ప్రిన్సిపాల్ అసంవార్ సాయినాథ్ మాట్లాడుతూ 14 ఏళ్ల లోపు బాలికలు ఈ టీకా తీసుకోవడం వల్ల గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ముప్పు తప్పుతుందన్నారు. హెచ్‌పీవీ ఉచిత వ్యాక్సిన్ అందించిన ఏరియా ఆసుపత్రి సిబ్బంది అబ్దుల్ సలీమ్, ఏఎన్‌ఎంలు జ్యోతి, రాజశ్రీ, ఆశా




కార్యకర్త పుష్పలతలను అభినందించారు.

# విట్టోలిలో 'జలసిరి' శంకుస్థాపన చేసిన సర్పంచు

ముధోల్, జూలై 23 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ముధోల్ మండల కేంద్రంతో పాటు విట్టోలి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం తెలంగాణ జలసిరి ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. విట్టోలి గ్రామానికి చెందిన రైతు భీమన్న వ్యవసాయ క్షేత్రంలో అధికారులు ఫామ్ పాండ్ నిర్మాణానికి మార్క్ అవుట్ నిర్వహించి పనులను ప్రారంభించారు.
మండల పంచాయతీ అధికారి శివకుమార్, సర్పంచులు మాట్లాడుతూ వర్షపు నీటిని పొలాల్లోనే నిల్వ చేసుకుని భూగర్భ జలాలను పెంచడానికి రైతులు ఫామ్ పాండ్లు, బోర్‌వెల్ రీఛార్జ్ లు నిర్మించుకోవాలన్నారు.



కార్యక్రమంలో సర్పంచులు షబానా బేగం, రుచిత, ఉపసర్పంచ్ లావణ్య, ఈవో అన్వర్ అలీ, ఈజీఎస్ టీఏ యోగేష్ పాల్గొన్నారు.

# కరేగాంలో పశువుల కాపరిపై అడవి పంది దారుణ దాడి

ముధోల్, జూలై 23 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ముధోల్ మండల పరిధిలోని కరేగాం గ్రామ సమీపంలో పశువులను మేపుతున్న కాపరిపై అడవి పంది దారుణంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. గ్రామానికి చెందిన కోనేలా ఎర్రన్న పొలాల వద్ద పశువుల కాపరిగా ఉండగా అడవి పంది ఒక్కసారిగా విరుచుకుపడి కోరలతో పొడవడంతో ఆయన



రక్తగాయాలపాలయ్యాడు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది భీంరావు, శేఖర్ ఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం భైంసా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అటవీ అధికారులు స్పందించి వన్యమృగాల బారి నుండి కాపాడాలని గ్రామస్తులు కోరారు.

# జాతీయ రహదారిపై కాంగ్రెస్ శ్రేణుల శాంతియుత నిరసన

ముధోల్, జూలై 23 (తెలంగాణ వెన్నెల వాక్కు):
లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, అగ్రనేతల అక్రమ అరెస్టును నిరసిస్తూ ముధోల్ మండల కేంద్రంలోని బాసర-భైంసా జాతీయ రహదారిపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం శాంతియుత నిరసన నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పోతన్న యాదవ్, మండల అధ్యక్షుడు కిష్టయ్య మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీపై ప్రశ్నించినందుకు నాయకులను అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు.
పోటీ పరీక్షల లీకేజీతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనమైందన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, మరణించిన విద్యార్థుల కుటుంబాలకు కోటి రూపాయల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరసనలో అఫ్రోజ్ ఖాన్, సాయిరాం, శ్రీనివాస్ గౌడ్, సమీవుల్లా ఖాన్, విట్టల్ పాల్గొన్నారు.



# ఇందిరమ్మ టవర్స్‌పై బీఆర్ఎస్ విష ప్రచారం

హైదరాబాద్ తెలంగాణ బ్యూరో ప్రతినిధి
రాష్ట్రంలో పేదలకు నాణ్యమైన వసతి కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రతిష్టాత్మక ఇందిరమ్మ టవర్స్ ప్రాజెక్టుపై ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ తీవ్రమైన విష ప్రచారం చేస్తోందని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను విక్రయిస్తున్నారంటూ సామాజిక మాధ్యమాలు, మీడియా వేదికగా సాగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని ఆయన స్పష్టం చేశారు. పేదల జీవితాలు, వారి ఆత్మగౌరవంతో రాజకీయాలు చేయడం తగదని బీఆర్ఎస్ నాయకులకు హితవు పలికారు. గురువారం తెలంగాణ సచివాలయంలో గృహనిర్మాణ శాఖ ఉన్నతాధికారులతో ప్రాజెక్టుల పురోగతిపై మంత్రి పొంగులేటి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ విషయాలను వెల్లడించారు.
?పేదలకు ప్రభుత్వం ఇళ్లు నిర్మించి ఇస్తుంటే బీఆర్ఎస్ నాయకులకు ఎందుకంత అభ్యంతరమని మంత్రి ప్రశ్నించారు. పదేళ్ల సుదీర్ఘ పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల ఇంటి కలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. పదేళ్లలో ఆ పార్టీ చేయలేని పనిని కాంగ్రెస్ ప్రభుత్వం స్వల్ప కాలంలోనే ఆచరణలో చూపిస్తుండటంతో ఓర్వలేకనే ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారానికి ఒడిగడుతున్నాయని మండిపడ్డారు. ఓపెన్ మార్కెట్లో



సుమారు రూ. 40 లక్షల నుంచి రూ. 60 లక్షల వరకు విలువ చేసే అత్యుత్తమ ఫ్లాట్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అందుబాటులోకి తెస్తోందని పొంగులేటి వివరించారు. ఈ ప్రాజెక్టులో రాష్ట్ర ప్రభుత్వం రూ. 5 లక్షల భారీ సబ్సిడీని సాయంగా అందిస్తోందని, దీనివల్ల లబ్ధిదారుడి వాటా కేవలం రూ. 6 లక్షలు మాత్రమే ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అత్యంత నాణ్యమైన వసతులతో కూడిన ఈ ఇళ్లు పేదల జీవన ప్రమాణాలను గణనీయంగా పెంచుతాయని ధీమా వ్యక్తం చేశారు.
?ఇళ్ల కేటాయింపు ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, నిబంధనలకు లోబడి జరుగుతుందని మంత్రి తెలిపారు. మొత్తం కేటాయింపుల్లో 50 శాతం రిజర్వేషన్లు అమలవుతాయని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా మహిళలకు 30 శాతం ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. అలాగే బీసీలకు 16 శాతం, ఎస్సీలకు 14 శాతం, ఎస్టీలకు 5 శాతం, దివ్యాంగులకు 5 శాతం కేటాయించగా, సమాజానికి సేవలందిస్తున్న అవుట్‌సోర్సింగ్, నాలుగో తరగతి ఉద్యోగులు మరియు పారిశుధ్య కార్మికులకు 10 శాతం రిజర్వేషన్ వర్తింపజేస్తున్నట్లు వెల్లడించారు. అర్హులైన పేద ప్రజలు దళారులను నమ్మి మోసపోవద్దని, ఇళ్ల కేటాయింపు కోసం నేరుగా ప్రభుత్వ అధికారిక మార్గాల ద్వారానే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మీ సేవ కేంద్రాలు, అధికారిక వెబ్‌సైట్లతో పాటు వాట్సాప్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకునే సదుపాయాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఇందిరమ్మ టవర్స్ దరఖాస్తులు మరియు మరిన్ని వివరాల కోసం పౌరులు 8096958096 అనే మీ సేవ వాట్సాప్ నంబర్‌ను సంప్రదించాలని

OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER TG-TEL/25/A0871, CELL: 9848568953, MAIL ID: telanganavennelawakku@gmail.com